నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, మంగళవారం 5 మార్చి 2024 | BHADRADRI KOTHAGUDEM

# రాములోరి పెండ్లికి ముహూర్తం ఖరారు

## వచ్చే నెల 17న శ్రీరామనవమి.. తర్వాతి రోజు మహాపట్టాభిషేకం



భద్రాచలం, మార్చి 4: దక్షిణ అయోధ్యపురి భద్రాద్రిలో కొలువైన రామయ్య కల్యాణ మహోత్సవానికి ముహూర్తం ఖరారైంది. ఆలయ వైదిక కమిటీ ఈ మేరకు సోమవారం ఆలయ ఈవో రమాదేవికి నివేదిక అందించింది. ఏప్రిల్ 17న పట్టణంలోని మిథిలా ప్రాంగణంలో శ్రీరామనవమి సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు అంగ రంగ వైభవంగా సీతారాముల కల్యాణం నిర్వహించనున్నారు. తదుపరి రోజు రామయ్యకు మహాపట్టాభిషేకం చేయనున్నారు. శ్రీరామనవమి సందర్భంగా ఇదే నెల 9 నుంచి ఆలయ సన్నిధిలో 23వ తేదీ వరకు వసంత పక్ష ప్రయుక్త శ్రీరామనవమి నవాహ్ని తిరు కల్యాణ బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. తొలిరోజు అర్చకులు ఉత్సవాలకు అంకురార్పణ చేయనున్నారు. రుత్విక్ వరణం, రక్షా బంధనం, స్నపన తిరుమంజనం, పుట్టమన్నుతో పూజ, కల్పవృక్ష వాహనంపై రామయ్యకు తిరువీధి సేవ, పంచాంగ శ్రవణం చేయనున్నారు. 13న మండల లేఖనం, కుండ, కలశ, అలంకరణాదులు, సార్వ భౌమ సేవ, 14న గరుడ ధ్వజ పట లేఖనం, పటావిష్కరణ, గరుడ ధ్వజాధివాసం, 15న అగ్ని ప్రతిష్ఠ, ధ్వజారోహణం, భేరీ తాడనం, దేవతాహ్వానం, బలి సమర్పణ, హనుమంత వాహన సేవ, 16న గరుడ వాహన సేవ, ఎదుర్కోలు సేవ, 19న సదస్యం, స్వామివారికి హంస వాహన సేవ, 20న తెప్పోత్సవం, చోరోత్సవం, అశ్వవాహన సేవ, 21న స్వామివారికి ఊంజల్ సేవ, సింహ వాహన సేవ. 22న వసంతోత్సవం, హవనం, గజవాహన సేవ, 23న చక్ర తీర్థం, పూర్ణాహుతి, శేష వాహన సేవ, ధ్వజారోహణం, ద్వాదశ ప్రదక్షిణ చేయనున్నారు. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఏప్రిల్ 9 నుంచి 23 వరకు స్వామివారి నిత్యకల్యాణం, దర్బార్ సేవలు, ఏప్రిల్ 9 నుంచి మే 1వరకు పవళింపు సేవలు నిలిపివేస్తున్నట్లు ఆలయ ఈవో తెలిపారు.

## పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేసిన కలెక్టర్

ఖమ్మం ఎడ్యుకేషన్, మార్చి 4 : నగరంలోని రాజేంద్రనగర్ ప్రభుత్వ పాఠశాలలో గల ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని కలెక్టర్ వీపీ గౌతమ్ సోమవారం తనిఖీ చేశారు. కేంద్రంలోని మౌలిక సదుపాయాల కల్పన, ప్రహరీ, భద్రతా అంశాలను పరిశీలించారు. వైద్య శిబిరాన్ని పరిశీలించడంతోపాటు ఎండల దృష్ట్యా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, అత్యవసర మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. చీఫ్ సూపరింటెండెంట్‌తో సహా ఇన్విజిలేటర్లు, పరీక్షా విధులకు కేటాయించిన ప్రతి ఒక్కరినీ తనిఖీ చేసి లోనికి అనుమతించాలని, సెల్‌ఫోన్లను అనుమతించొద్దని భద్రతా సిబ్బందిని ఆదేశించారు. లోటుపాట్లు లేకుండా పరీక్షలు సజావుగా జరిగేలా చూడాలని కలెక్టర్ సూచించారు.

# ప్రజా సంక్షేమమే ధ్యేయం

## సత్తుపల్లి నియోజకవర్గ సమీక్షలో మంత్రి పొంగులేటి

మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

సత్తుపల్లి రూరల్, మార్చి 4 : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తున్నదని, అధికారులు నిబద్ధతతో పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం ఎంఆర్ గార్డెన్స్‌లో జరిగిన నియోజకవర్గస్థాయి అధికారుల సమీక్షా సమావేశానికి హాజరైన ఆయన మాట్లాడుతూ అధికారులు ప్రజా అవసరాలను గుర్తించి.. వాటిని పరిష్కరించినప్పుడే ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందన్నారు. ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన 82 రోజుల్లోనే హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల్లో నాలుగింటిని నెరవేర్చామని, మరికొద్ది రోజుల్లో అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామన్నారు. అధికారులు ఏ విషయంలోనైనా అవినీతికి పాల్పడితే నిర్మొహమాటంగా విధుల నుంచి తొలగిస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ప్రతిభ ఆధారంగానే ఉద్యోగాలు వస్తాయని, పైరవీకారుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన మాట ప్రకారం 25వేల ఉద్యోగాలను భర్తీ చేశామని, మెగా డీఎస్సీ ద్వారా 11 వేల ఉద్యోగాలను త్వరలోనే భర్తీ చేస్తామన్నారు. ధరణిలో ఉన్న సమస్యలను గుర్తించి.. కమిటీ ద్వారా పరిష్కరించేందుకు స్పెషల్ డ్రైవ్ చేపట్టినట్లు తెలిపారు. సత్తుపల్లి తన సొంత నియోజకవర్గం అయినందున పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేసి అర్హులందరికీ ఇస్తామన్నారు. సింగరేణి బ్లాస్టింగ్ వల్ల నష్టపోయిన బాధితులను ఆ సంస్థే ఆదుకోవాలని సూచించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యం అందించి ప్రజల్లో భరోసా కల్పించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెంచేందుకు అధికారులు కృషి చేయాన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని ప్రజలకు మంచినీటి కొరత లేకుండా చూడాలన్నారు. సాగర్‌పై ఉన్న లిఫ్టులను పునరుద్ధరించి రైతులకు ఉపయోగపడేలా చూడాలని నీటిపారుదల శాఖ అధికారులకు సూచించారు. రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందించేలా అధికారులు చూడాలన్నారు. అనంతరం అన్ని శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించి నివేదికలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే మట్టా రాగమయి, అదనపు కలెక్టర్ సత్యప్రసాద్, ఆర్డీవో శ్రీనివాసరావు, డీఎఫ్‌వో సిద్దార్థ విక్రమ్‌సింగ్, ఏసీపీ అనిశెట్టి రఘు, డీసీసీబీ మాజీ చైర్మన్ మువ్వా విజయ్‌బాబు, డాక్టర్ మట్టా దయానంద్, మున్సిపల్ కమిషనర్ రవిబాబు, వైస్ చైర్‌పర్సన్ తోట సుజలారాణి, వివిధ శాఖల ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నామా, కవితకు మరో ఛాన్స్

## బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులుగా ఖరారు

**ఖమ్మం, మానుకోట పార్లమెంటరీల స్థాయి సమావేశంలో పార్టీ అధినేత కేసీఆర్ ప్రకటన**

**పార్టీ గెలుపు కోసం పని చేయాలని నాయకులు, కార్యకర్తలకు పిలుపు**

**అభ్యర్థుల ఎంపికపై గులాబీ శ్రేణుల హర్షం**

ఖమ్మం, మార్చి 4 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఖమ్మం, మహబూబాబాద్ ఎంపీ స్థానాల నుంచి మరోసారి పోటీ చేసేందుకు నామా నాగేశ్వరరావు, మాలోతు కవితకు అవకాశం కల్పించారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో సోమవారం జరిగిన పార్టీ ఖమ్మం, మహబూబాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గాల సమావేశంలో ఖరారు చేశారు. రెండు స్థానాల్లోనూ బీఆర్ఎస్‌దే విజయమని పార్టీ అధినేత ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీపై ఇప్పటికే ప్రజల్లో అసహనం ప్రారంభమైందని, వ్యతిరేక పవనాలు వీస్తున్నాయని, బీఆర్ఎస్‌కే ప్రజలు మద్దతు ఉంటుందన్నారు. గత ఎంపీ ఎన్నికల్లో నామా నాగేశ్వరరావు 1.68 లక్షల ఓట్లు, మాలోతు కవిత 1.46 లక్షల ఓట్ల మెజార్టీతో గెలిచారని గుర్తుచేశారు. అవే ఫలితాలు మళ్లీ పునరావృతమవుతాయన్నారు. నామా లోక్‌సభలో తెలంగాణ ప్రజల వాణిని వినిపించారని, ఎన్నో సమస్యల పరిష్కారానికి కృషి చేశారని కొనియాడారు. రెండు ఎంపీ స్థానాల్లో విజయం సాధించేందుకు తాను రోడ్ షోలు, సమావేశాల్లో పాల్గొంటానన్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థుల విజయం కోసం పార్టీ నాయకులు, ఇన్‌చార్జులు, ప్రజాప్రతినిధులు సైనికుల్లా పనిచేయాలని పిలుపునిచ్చారు. పార్టీని వీడిన వారి గురించి పెద్దగా ఆలోచించాల్సిన అవసరం లేదన్నారు. ఖమ్మంలో త్వరలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని ప్రకటించారు. సమావేశంలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కల్వకుంట్ల తారకరామారావు, మాజీ మంత్రి హరీశ్‌రావు, లోక్‌సభ సభ్యులు నామా నాగేశ్వరరావు, మాలోతు కవిత, రాజ్యసభ సభ్యులు కేశవరావు, బండి పార్థసారథిరెడ్డి, వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజు, పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, పార్టీ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు, మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకటవీరయ్య, మెచ్చా నాగేశ్వరరావు, తాటి వెంకటేశ్వర్లు, హరిప్రియానాయక్, బానోత్ మదన్‌లాల్, వనమా వెంకటేశ్వరరావు, ఖమ్మం నగర మేయర్ కొనుకొల్లు నీరజ, పార్టీ నాయకులు కొండబాల కోటేశ్వరరావు, బొమ్మెర రామ్మూర్తి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్, పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్, ఎంపీలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు

### కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత వైఖరిని ఎండగట్టాలి : మాజీ మంత్రి హరీశ్‌రావు

లోక్‌సభ ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థుల విజయం కోసం ప్రతిఒక్కరూ శక్తివంచన లేకుండా కృషిచేయాలని మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వ మోసపూరిత వైఖరిని ప్రజలకు వివరించాలన్నారు. తెలంగాణ ప్రజల సమస్యలను ఢిల్లీ వేదికగా వినిపించే సత్తా ఒక్క బీఆర్ఎస్ అభ్యర్థులకే ఉందన్నారు. రాష్ట్ర ప్రజల ప్రయోజనాలు కాపాడడంలో బీఆర్ఎస్ నాయకులు ముఖ్య పాత్ర పోషించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడు నెలలు కావొస్తున్నా ఆరు గ్యారెంటీలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. మార్చి 17తో కాంగ్రెస్ పాలనకు 100 రోజులు పూర్తవుతాయని, అయినా హామీలు అమలయ్యే పరిస్థితి లేదన్నారు.

## నామా నాగేశ్వరరావు బయోడేటా

**తండ్రి పేరు :** ముత్తయ్య
**తల్లి పేరు:** వరలక్ష్మి
**పుట్టిన ప్రదేశం:** మహబూబాబాద్ జిల్లా బలపాల గ్రామం
**పుట్టిన తేదీ:** 15 మార్చి 1957
**భార్య:** చిన్నమ్మ
**సంతానం:** ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె
**విద్యార్హతలు:** ఇంటర్మీడియట్
**వృత్తి :** వ్యాపారవేత్త
**నివాసం:** ఖమ్మం

-2009లో తెలుగుదేశం పార్టీ నుంచి 15వ లోక్‌సభ సభ్యుడిగా ఖమ్మం పార్లమెంటరీ నియోజకవర్గం నుంచి ఎన్నికయ్యారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో ఎంపీగా గెలుపొందారు. ప్రస్తుతం బీఆర్ఎస్ పార్టీ పార్లమెంటరీ పక్ష నేతగా కొనసాగుతున్నారు.

## మాలోతు కవిత బయోడేటా..

**తల్లిదండ్రులు :** ధరంసోత్ రెడ్యానాయక్, లక్ష్మి
**భర్త :** భద్రూనాయక్
**సంతానం :** కూతురు మహతి, కుమారుడు నయన్
**రాజకీయ ప్రవేశం:** 2008 కాంగ్రెస్‌లో చేరిక, 2009లో మహబూబాబాద్ ఎమ్మెల్యేగా గెలుపు, 2014లో అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి, 2019లో మహబూబాబాద్ ఎంపీగా గెలుపు.

## ప్రజానేత నామా నాగేశ్వరరావు..

నామా నాగేశ్వరరావు 2004లో టీడీపీలో చేరడం ద్వారా ఆయన రాజకీయ ప్రస్థానం మొదలైంది. 2004లో ఖమ్మం ఎంపీ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రేణుకాచౌదరిపై ఓటమి చెందారు. తిరిగి నామా 2009లో ఇదే ఎంపీ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా రేణుకాచౌదరిపై పోటీ చేసి ఘన విజయం సాధించారు. తొలిసారిగా లోక్‌సభ సభలో అడుగుపెట్టారు. 2014 ఎంపీ ఎన్నికల్లో ఖమ్మం ఎంపీ స్థానం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పొంగులేటి శ్రీనివాసరెడ్డిపై స్వల్ప ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. 2019లో ఇదే ఎంపీ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి రేణుకాచౌదరిపై 1.66 లక్షల పైచిలుకు ఓట్లతో ఘనవిజయం సాధించారు. నామా కేంద్ర స్థాయిలో పలు స్టాండింగ్ కమిటీల్లో సభ్యుడిగా, బీఆర్ఎస్ లోక్‌సభా పక్ష నేతగా కీలకంగా పనిచేశారు. తెలంగాణ ప్రజల గొంతుకై లోక్‌సభలో గళం వినిపించారు. ప్రజానేతగా నామా పేరు తెచ్చుకున్నారు. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థిగా నామాను ఎంపిక చేయడంపై పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. కదన రంగంలోకి దూకేందుకు సిద్ధమవుతున్నాయి. ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఈనెల 7న బీఆర్ఎస్ కీలక నేతలు ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల స్థాయిలో సమావేశం నిర్వహించనున్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు తాతా మధుసూదన్ ఈ మేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

## మానుకోట మాలోతు కవితకే..

ఖమ్మం, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధి ముఖ్య నేతలతో పార్టీ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లంబాడాల నుంచి దేశంలోనే తొలి మహిళా ఎంపీగా గుర్తింపు పొంది.. మహబూబాబాద్ పార్లమెంట్ పరిధి నాయకులతో కలుపుగోలుగా ఉంటూ పాలనలో సమర్థవంతంగా ముందుకెళ్తున్న ఆమె నాయకత్వ పటిమను చూసి కేసీఆర్ మరోమారు అవకాశం ఇచ్చారు.

మహబూబాబాద్ జిల్లా చిన్నగూడూరు మండలం ఉగ్గంపల్లిలో 1980, జనవరి 1న కవిత జన్మించారు. బీఎస్సీ కంప్యూటర్స్ పూర్తి చేశారు. తన తండ్రి డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ నుంచి రాజకీయ పాఠాలు నేర్చుకున్నారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా జనరల్ స్థానంగా ఉన్న మహబూబాబాద్ అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలు ఎస్టీలకు రిజర్వ్ అయ్యాయి. అవకాశం కలిసిరావడంతో 2009లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీచేసి ఎమ్మెల్యేగా గెలుపొందారు. 2014లో తిరిగి ఇదే నియోజకవర్గం నుంచి పోటీ చేసి బీఆర్ఎస్ అభ్యర్థి శంకర్‌నాయక్ చేతిలో ఓటమిపాలయ్యారు. అనంతరం జరిగిన రాజకీయ పరిణామాల్లో భాగంగా కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. 2019లో మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి బలరాంనాయక్‌పై 1.46 లక్షల మెజార్టీతో గెలుపొందారు. కాగా, రానున్న పార్లమెంట్ ఎన్నికల కోసం మహబూబాబాద్ స్థానం నుంచి మరోమారు ఆమె అభ్యర్థిత్వాన్ని బీఆర్ఎస్ అధిష్టానం ఖరారు చేసింది.

# నిరుడు నీళ్లు నేడు నెర్రెలు

- చెరువులు, కుంటల్లో అడుగంటిన జలాలు
- చేతికొచ్చిన పంటలకు నీరందక నెర్రెలుబారిన నేలలు
- పంటల సాగు లేక బీళ్లుగా మారిన మాగాణి భూములు
- భక్తరామదాసు లిఫ్టు ద్వారా చెరువులు, కుంటలు నింపాలంటున్న రైతులు

బచ్చోడు ప్రాంతంలో ఎండిపోతున్న యాసంగి వరి పొలాలు

తిరుమలాయపాలెం, మార్చి 4 : చెరువులు, కుంటల కింద యాసంగి పంటలు సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. ఉన్న నీటితో నారు పోసిన నాటి నుంచి పంట ఏపుగా వచ్చే వరకు నెట్టుకొచ్చిన రైతులు ప్రస్తుతం చెరువులు, కుంటల్లో నీరు అడుగంటడంతో పంటను చూసి దిగులు చెందుతున్నారు. కొందరు ముందస్తు ఆలోచనతో సాగు చేయకపోవడంతో మాగాణి భూములన్నీ బీళ్లుగా మారాయి. బచ్చోడు, జూపెడ, సుబ్లేడు, బీరోలు, పిండిప్రోలు, తెట్టెలపాడు, తాళ్లచెరువు, పాతర్లపాడు, మేడిదపల్లి తదితర ప్రాంతాల్లో చెరువుల కింద సాగు చేసిన పొలాలకు నీరందకపోవడంతో నెర్రెలు బారుతున్నాయి. గత కేసీఆర్ ప్రభుత్వం భక్తరామదాసు ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి తిరుమలాయపాలెం మండలానికి శాశ్వతంగా సాగునీరు అందించి కరువు ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసింది. పాలేరు రిజర్వాయర్ నుంచి భక్తరామదాసు ఎత్తిపోతల పథకం ద్వారా మండలంలోని చెరువులను నింపి రబీలో పంటలకు పుష్కలంగా నీరందించింది. గత ఏడాది ఈ సమయంలో చెరువులు, కుంటలు జలకళతో నిండుకుండలను తలపించాయి. ఈ ఏడాది మాత్రం చెరువులు, కుంటల్లో నీరులేక పరిస్థితి దయనీయంగా మారింది. వ్యవసాయాధికారుల లెక్కల ప్రకారం గత ఏడాది రబీలో రైతులు 13,050 ఎకరాల్లో వరి సాగు చేయగా.. ఈ ఏడాది 11,267 ఎకరాల్లో మాత్రమే సాగు చేశారు. అయితే చెరువుల కింద సాగు చేసిన పొలాలు సైతం నీళ్లులేక ఎండిపోతున్నాయి. ప్రభుత్వం సాగర్ నుంచి పాలేరు రిజర్వాయర్‌కు నీటిని తెప్పించి భక్తరామదాసు లిఫ్టు ద్వారా చెరువులు నింపకపోవడమే ఈ దుస్థితికి కారణమని రైతులు భావిస్తున్నారు. ఉమ్మడి పాలనను గుర్తు చేసుకుంటూ మళ్లీ పాత రోజులు వస్తాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

చెరువులో నీరు లేక బచ్చోడు చెరువు కింద సాగు చేయక బీళ్లుగా ఉన్న భూములు

### వరుస తడులు పెడుతున్నాం

గత ఏడాది నీళ్లకు కొదవ లేదు. ఈ ఏడాది చెరువులో నీళ్లు సరిగ్గా లేవు. కొన్ని పొలాలకు నీరందక ఎండిపోతున్నాయి. చెరువు కింద బావులు, బోర్లు ఉన్నవారు వరుస తడులు పెట్టి పంటలను కాపాడుకుంటున్నారు. ఈ ఏడాది యాసంగి పొలాలు పండడం కష్టంగానే ఉంది. ఈసారి దిగుబడులు బాగా తగ్గే అవకాశం ఉంది. **– శ్రీరాములు, రైతు, బచ్చోడు**

### భక్తరామదాసు లిఫ్టుతో చెరువులు నింపాలి

చెరువుల్లో నీళ్లులేక యాసంగిలో సాగు చేసిన వరి పొలాలు ఎండిపోతున్నాయి. సుబ్లేడు చెరువు కింద కాల్వలు సరిగ్గా లేక నీళ్లు పారడం లేదు. ప్రభుత్వం చొరవ తీసుకొని భక్తరామదాసు లిఫ్టు ద్వారా చెరువులు, కుంటలు నింపి రైతులను ఆదుకోవాలి. **– ఎస్‌డీ జీయావుద్దీన్, జడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు, సుబ్లేడు**

# ఖమ్మంలో 'కాంచీపురం వరమహాలక్ష్మి'

## వస్త్ర దుకాణాన్ని ప్రారంభించిన త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామీజీ

రఘునాథపాలెం, మార్చి 4 : పెద్ద పట్టణాలకే పరిమితమైన 'కాంచీపురం వరమహాలక్ష్మి' వస్త్ర దుకాణం ఖమ్మం జిల్లా ప్రజల చెంతకు చేరింది. ఖమ్మం బైపాస్ రోడ్‌లోని కొత్త బస్టాండ్ వద్ద ఒకటి, మరో దుకాణాన్ని కస్బాబజార్‌లో నూతనంగా ఏర్పాటు చేశారు. తమ వ్యాపారాన్ని విస్తృతం చేయడంలో భాగంగా ఖమ్మంలోనే రెండు దుకాణాలను నెలకొల్పారు. సోమవారం బైపాస్ రోడ్డులోని నూతన వస్త్ర దుకాణాన్ని త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామీజీ ముఖ్యఅతిథిగా పాల్గొనగా.. అమ్మ ఫౌండేషన్ చైర్పర్సన్ మల్లు నందిని విక్రమార్క, యూత్ కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్‌తో కలిసి ప్రత్యేక పూజలు చేసి ప్రారంభించారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకే పరిమితమైన 'కాంచీపురం వరమహాలక్ష్మి' ఖమ్మంలోనూ ప్రారంభించడం సంతోషకరమన్నారు. సాయి సిల్క్స్ కళామందిర్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ చలవాడి ప్రసాద్ మాట్లాడుతూ ఖమ్మంలో నూతన స్టోర్‌ను ఏర్పాటు చేసినందుకు సంతోషిస్తున్నామన్నారు. 2023 ఆర్థిక సంవత్సరంలో 44.90 శాతం ఆదాయం తెలంగాణ రాష్ట్రం నుంచే లభించినట్లు పేర్కొన్నారు. చీరల విక్రయాల్లో 50 శాతం వాటా కలిగిన దక్షిణ భారత మార్కెట్‌పై దృష్టి పెట్టాలని కార్యాచరణ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ బాధ్యులు కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డులో వస్త్ర దుకాణాన్ని ప్రారంభిస్తున్న అహోబిల రామానుజ జీయర్ స్వామీజీ

జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అమ్మ ఫౌండేషన్ చైర్పర్సన్ మల్లు నందిని

## ఇంటర్ మూల్యాంకనం ప్రారంభం

ఖమ్మం ఎడ్యుకేషన్, మార్చి 4 : ఖమ్మం నగరంలోని నయాబజార్ జూనియర్ కళాశాల కేంద్రంగా ఇంటర్ మూల్యాంకనం ప్రక్రియ సోమవారం ప్రారంభమైంది. జిల్లాకు చేరిన సమాధాన పత్రాలకు తొలుత కోడింగ్ నిర్వహించాల్సి ఉంటుంది. ఈ ప్రక్రియ అనంతరం వాల్యుయేషన్ చేసే అసిస్టెంట్ ఎగ్జిమినర్, చీఫ్ ఎగ్జామినర్‌కు అందజేస్తారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు, రోజుకు 30 పేపర్లను మూల్యాంకనం చేయనున్నారు.

### *4 లక్షలకు పైగా సమాధాన పత్రాలు..*

ఇంటర్ స్పాట్‌కు జిల్లాకు సుమారు 4.44 లక్షలకుపైగా సమాధాన పత్రాలు చేరాయి. ఇతర జిల్లాలకు సంబంధించిన సమాధాన పత్రాలను వాల్యుయేషన్ చేయనున్నారు. ప్రథమ, ద్వితీయ కలిపి 4,44,759 సమాధాన పత్రాలు వచ్చాయి. మూల్యాంకన ప్రక్రియ ఈ నెల 24వ తేదీ వరకు నిర్వహించారు. కేంద్రాలను క్యాంప్ ఆఫీసర్ రవిబాబు, అడిషనల్ క్యాంప్ ఆఫీసర్ కుతుంబాక శ్రీనివాసరావు పరిశీలించారు. నాలుగు స్పెల్స్‌లో మూల్యాంకనం జరగనుండగా ఈ నెల 16వ తేదీ నుంచి ఫస్ట్ స్పెల్‌లో నాన్ లాంగ్వేజెస్ సబ్జెక్ట్‌ల వాల్యుయేషన్ ప్రారంభంకానుంది.

## జాతీయ ఉద్యాన ప్రదర్శనకు జిల్లా రైతాంగం

ఖమ్మం వ్యవసాయం, మార్చి 4 : బెంగుళూరులో ఈ నెల 5 నుంచి 7వ తేదీ వరకు జరుగుతున్న జాతీయస్థాయి ఉద్యాన ప్రదర్శనకు జిల్లా నుంచి 50మంది రైతులు తరలివెళ్లారు. సోమవారం బస్సుయాత్రను జిల్లా ఉద్యానశాఖ అధికారి జీ అనసూయ ప్రారంభించారు. ఈ ఉద్యాన ప్రదర్శనలో మేలైన కొత్తరకం వంగడాలు, సాంకేతిక సలహాలు, సాగు పద్ధతులు, జాతీయ స్థాయిలో పండే పంటల వివరాలు తెలుసుకోనున్నారు. రైతులతోపాటు ఉద్యానశాఖ అధికారులు ఏ వేణు, జీ నగేశ్ తరలివెళ్లారు.